క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులను, ముడుపులను భక్తులు చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. గంగమ్మ దేవాలయం సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి, సాయిబాబా దేవాలయాలలో భక్తులు పూజలు చేశారు.

ఉపాధ్యాయులు పోరుబాటుకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా

జమ్మలమడుగు రూరల్ : కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలల కావస్తున్నా ఉపాధ్యాయుల సమస్యలపై ఏ మాత్రం స్పందించడంలేదని ఉపాధ్యాయులు సమస్యలు సాధించుకోవాలంటే పోరుబాటుకు సిద్ధం కావాలని ఎస్టీయూ కడప జిల్లా శాఖ అధ్యక్షుడు ఇలియాస్ బాషా తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఎస్టీయూ రాష్ట్ర కన్వీనర్ కుండా భాస్కర్ అధ్యక్షతన రీజియన్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఏ మాత్రం కృషి చేయడంలేదని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డి, మండల విద్యాశాఖధికారులు చౌడయ్య, చంద్రశేఖర్‌రావు, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఖాదర్‌వలికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న ఖాదర్‌వలి

సింహాద్రిపురం : స్థానిక శ్రీవివేకానంద పాఠశాలకు చెందిన టీచర్ ఖాదర్‌వలికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. కడపలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆదివారం క్రుష్మా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఈఓ రాజగోపాల్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఎంఈఓ సరస్వతి చేతులమీదుగా ఖాదర్‌వలి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు.

విస్తారంగా మొక్కజొన్న సాగు



పులివెందులలో సాగు చేసిన మొక్కజొన్న పంట

పులివెందుల రూరల్ : మండల వ్యాప్తంగా రైతులు మొక్కజొన్న సాగుపై దృష్టి సారించారు. 55 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. రెండేళ్ల నుంచి మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోందన్నారు. మొక్కజొన్న సాగు చేయాలంటే ఎకరాకు రూ.10వేల నుంచి రూ.15 వేలు ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు. ఎకరా మొక్క జొన్న పంటలో దిగుబడి మాత్రం రూ.50వేలు వస్తుందన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం



అనాథ వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న కుటుంబ సభ్యులు

వేంపల్లె : స్థానిక పాత గండిరోడ్డు నాగమ్మనగర్‌లోని మదర్ థెరిస్సా అనాథ ఆశ్రమంలో చింతలమడుగుపల్లెకు చెందిన దివంగత సింగారెడ్డి వీరమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు అనాథ వృద్ధులకు అన్నదానం చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

గిట్టుబాటు ధరలేక ఉల్లి రైతుకు కన్నీరు



ఉల్లిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

ముద్దనూరు : ఉల్లిపంట సాగుచేసిన రైతులు గిట్టుబాటు ధర లేక కన్నీరుమున్నీరవుతున్నారు. పంట చేతికొచ్చిన సమయంలో మార్కెట్‌లో ఉల్లికి ప్రకటించిన మద్దతు ధరతో రైతులు నష్టాలపాలవుతున్నారు. పంటసాగులో చేసిన ఖర్చులు కూడా దక్కడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించాలంటే ఉల్లిలో నాణ్యతలేదని కొనుగోలు చేయడానికి ముందుకురావడంలేదని రైతులు వాపోతున్నారు. గత్యంతరం లేక ఉల్లి రైతులు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. మండలంలోని పలుప్రాంతాలలో పండించిన ఉల్లిని నెల్లూరు, చెన్నై తదితర ప్రాంతాల వ్యాపారులు కేవలం క్వింటాలు రూ.600లకు కొనుగోలు చేస్తున్నారని, గతంతో



విక్రయానికి బస్తాలలో నింపిన ఉల్లి

పోలిస్తే మద్దతు ధర చాలా తక్కువగా వుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఒక ఎకరా ఉల్లి సాగులో ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు కలిసి సుమారు రూ.70వేలు పెట్టుబడి అవుతోందని, అయితే ప్రస్తుత ధరతో నష్టాలు చవిచూస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉల్లిసాగులో నష్టపోయా



నేను 3 ఎకరాలలో ఉల్లిపంటను సాగుచేశా. ఉల్లిగడ్డలు చేతికొచ్చే సమయానికి గిట్టుబాటు ధరలేదు. పెట్టిన పెట్టుబడి కూడా అందడంలేదు. ఉల్లి పంట సాగులో పూర్తిగా నష్టపోయాను. గతంలో ఉల్లిపంటకు తగిన మద్దతు ధర వుండేది. నష్టానికే ఉల్లిని అమ్ముకున్నాను.

–షైక్షాక్, ఉల్లిరైతు, చింతకుంట

క్వింటాలు రూ.600కు విక్రయించా



2 ఎకరాలలో ఉల్లిపంటను సాగుచేశా. పంట చేతికొచ్చిన సమయానికి క్వింటాలు ధర రూ.600కు విక్రయించాను. దూరప్రాంతాలకు రవాణాచేస్తే నష్టం వస్తుందని, వ్యాపారులకు అమ్ముకున్నాను. ఎకరాకు సుమారు రూ.70వేలు ఖర్చుపెట్టాను. పెట్టిన ఖర్చుకూడా అందలేదు.

–ఏసన్న, ఉల్లిరైతు, చింతకుంట

క్రమశిక్షణ నేర్పించాలి

జమ్మలమడుగు రూరల్ : ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు విలువలతో కూడిన క్రమశిక్షణ, నడవడిక నేర్పించాలని ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రాంగోపాల్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బాలాజీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి పలువురు సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో బాలాజీ హైస్కూల్ డైరక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి, కరస్పాండెంట్ దీప్తి నిఖిలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళారులకే రైల్వే టికెట్లు

కొండాపురం : స్థానిక రైల్వేస్టేషన్‌లో దళారులకు మాత్రమే తత్కాల్ టికెట్లు ఇస్తున్నారని ప్రయాణికులకు ఇవ్వడం లేదని వెంకటాపురంకు చెందిన విజయభాస్కర్‌రెడ్డి ఆదివారం ఆరోపించారు. అతని వివరాల మేరకు రైల్వేస్టేషన్‌లో టికెట్లు ఇచ్చే అధికారిని రెండు రోజులనుండి తత్కాల్ టికెట్ ఇవ్వమని అడిగిన ఇవ్వలేదన్నారు. తత్కాల్ టికెట్‌పై దళారుల వద్ద అదనంగా డబ్బులు తీసుకుంటున్నారని వారికే ఇస్తున్నారని ఇలాంటి సంఘటనలు జరగకుండా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

కన్నుల పండువగా గ్రామోత్సవం



గ్రామోత్సవంలో గణపతి, చౌడేశ్వరీదేవి

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగాలపల్లెలో నిర్వహిస్తున్న గణపతి, చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం గణపతి, చౌడమ్మ మూలమూర్తుల గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. భక్తులకు గండ్లూరు వీరప్రతాప్‌రెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు గణపతి తదుపరి చౌడేశ్వరీదేవి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కోలాటం ఏర్పాటు చేశారు.

ఇరువురిపై కేసు నమోదు

కొండాపురం : మండలంలోని బెడుదూరు గ్రామంలో రామచంద్రుడు, తిరుపతయ్య ఇద్దరు పాత కక్షల కారణంగా గొడవపడటంతో ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ రాయపాటి భాను ఆదివారం తెలిపారు.

మార్కెట్ యార్డు చైర్మన్‌గా అమర్

పులివెందుల రూరల్ : పులివెందుల మార్కెట్ యార్డు చైర్మన్‌గా గడ్డం అమర్నాథ్‌ను ప్రభుత్వం నియమించింది. ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో మార్కెట్ యార్డు చైర్మన్‌గా అమర్నాథ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

జూదరుల అరెస్ట్

ముద్దనూరు : కోనాపురం గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో పేకాట ఆడుతున్న 5 మంది జూదరులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10,250 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



ఆర్‌ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలలో మాట్లాడుతున్న వక్తలు

ఎర్రగుంట్ల : పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర హైస్కూల్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) శతాబ్ది ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ వక్తలు మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం సంఘం పనిచేస్తుందన్నారు. కాషాయ జెండానే గురువుగా భరతమాతను తల్లిగా భావించి స్వయం సేవకులు దేశ రక్షణ కోసం పని చేస్తున్నారని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి నేటితో 100 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఆటుపోట్లను ఎదుర్కొందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



శాస్త్రీయ నృత్యంలో చిన్నారులు

పులివెందుల టౌన్ : దసరా సంబరాల్లో భాగంగా పట్టణంలోని స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పిల్లలు, పెద్దలు ఆట పాటలతో శిల్పారామ ప్రాంగణమంతా సందడిగా మారింది. పులివెందులకు చెందిన భవాని కృష్ణ క్లాసికల్ డ్యాన్స్ మాస్టర్ భవాని ఆధ్వర్యంలో చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రేక్షకులు చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమ ఏర్పాట్లను శిల్పారామం ఏఓ విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఫీల్డ్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రవికుమార్

సింహాద్రిపురం : ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన వాహనాలను తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్సుతోపాటు వాహనానికి సంబంధించిన రికార్డులు కలిగి ఉండాలని, లేకుంటే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. అలాగే మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదన్నారు. ఇస్తే ప్రమాదాలకు కారకులు తల్లిదండ్రులే అవుతారన్నారు. అనంతరం లైసెన్స్‌లు, వాహన రికార్డులు లేని వారికి జరిమానాలు విధించారు.

న్యాయమైన కోరికలను పరిష్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు

జమ్మలమడుగు రూరల్ : సచివాలయ ఉద్యోగుల న్యాయమైన కోరికలను పరిష్కరించాలని జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చిన్నమస్తాన్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని డీఎల్‌డీఓ కార్యాలయం ఎదుట వారు నిరసన ర్యాలీ నిర్వహించి వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులను మాతృ శాఖలో విలీనం చేసి సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్‌తో కూడిన వేతనాన్ని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణ్, జిల్లా కన్వీనర్ మస్తాన్, డివిజన్ కన్వీనర్ రాజారెడ్డి, మైలవరం, పెద్దముడియం, ముద్దనూరు, మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాలపై శిక్షణ తరగతులు



భగవద్గీత శ్లోకాలపై శిక్షణ ఇస్తున్న ట్రైనర్ సునీత

సింహాద్రిపురం : స్థానిక పెద్దమ్మ ఆలయంలో ఆదివారం బాల, బాలికలకు భగవద్గీత శ్లోకాలు, విష్ణు సహస్రనామావళి, సంస్కారంపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ట్రైనర్ సునీత భగవద్గీత శ్లోకాలు, విష్ణు సహస్రనామావళిపై పిల్లలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండవ శనివారం, ప్రతి ఆదివారం ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని, ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శున'కాలు' పట్టేస్తున్నాయి..

- ఒక్క రోజే నలుగురిపై దాడి
- భయాందోళనలలో పట్టణ ప్రజలు



వేంపల్లి రోడ్డులో కుక్కల దాడికి గురైన పాపులమ్మ



ఎర్రగుంట్లలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు (ఫైల్)

ఎర్రగుంట్ల : వీధుల్లో కుక్కల బెడద తీవ్రమైంది. ఏవీధిలో చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తూండటంతో రాకపోకలు సాగించేందుకు జనం జంకుతున్నారు. ఆదివారం పట్టణంలోని వేంపల్లి రోడ్డులో ఓ వృద్ధురాలు పాపులమ్మ రోడ్డుపై పోతుండగా కుక్క వచ్చి కాళ్లు పట్టుకుని కండపీకేసింది. అలాగే మరో ముగ్గురిపై కూడా దాడి చేశాయి. దీంతో ప్రజలు భయపడుతున్నారు. ఇటీవల కుక్కలను పట్టుకోవడానికి మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని సుమారు 247 కుక్కలను పట్టుకుని వాటికి పిల్లలు పుట్టకుండా వ్యాక్సిన్ వేసి బయటకు వదిలివేస్తున్నారు. బాధితులు రేబీస్ వాక్సిన్ కోసం ప్రొద్దుటూరుకు పరుగులు తీసినట్లు స్థానికులు తెలిపారు. కూలీ పనులు చేసుకుని జీవించే నిరుపేదలకు కుక్క కరిస్తే డబ్బులు లేక ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్తే ఒక్కొక్కసారి యాంటి రేబిస్ ఇంజెక్షన్లు లేక ప్రొద్దుటూరుకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం మెరుగు

కడప అర్బన్: సైక్లింగ్‌తో ఆరోగ్యం మెరుగుపడుతుందని ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో ఆదివారం కడపలో పోలీసుల ఆధ్వర్యంలో «సైకిల్ ఆన్ సండే» కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, సంధ్య సర్కిల్, ఎర్రముక్కపల్లి సర్కిల్, మహావీర్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, ఎస్పీ బంగ్లా, రాజారెడ్డి వీధి మీదుగా జిల్లా పోలీసు కార్యాలయం వరకు సైకిల్ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ సైకిల్ తొక్కి అందరినీ ఉత్సాహపరిచారు.

ఎగ్జిబిషన్‌లో సందర్శకుల నిలువు దోపిడీ

విజయదశమి రోజున రూ.100..
ఇప్పుడు రూ.80

ప్రొద్దుటూరు: స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో కాంట్రాక్టర్ ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారు. బహిరంగ దోపిడీపై మున్సిపల్ అధికారులు కళ్లప్పగించి చూడటమేగానీ చేసిందేమీ లేదు. మున్సిపల్ నిబంధనల ప్రకారం ఎగ్జిబిషన్ ఎంట్రన్స్ టికెట్ ధర రూ.35, పిల్లలకు రూ.25 మాత్రమే ఉండాలని గెజిట్‌లో పేర్కొన్నా కాంట్రాక్టర్ ఈ నిబంధనను పట్టించుకోలేదు. దసరా రోజున ఎంట్రన్స్ టికెట్ రూ.100, ఆదివారం రూ.80 చొప్పున ముక్కుపిండి వసూలు చేశారు. ఎందుకు ఇలా వసూలు చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నా తాము పనిచేసే కూలీలమని, ఏదైనా ఉంటే కాంట్రాక్టర్‌తో మాట్లాడుకోవాలని సిబ్బంది చెబుతుండటం గమనార్హం. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎగ్జిబిషన్ ఎంట్రన్స్ టికెట్ లేకుండా ఉచిత ప్రవేశం కల్పించారు. ప్రజలపై భారం వేయడం సరికాదని ఆయన నిర్లయించారు.

7న ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో ధర్నా

ప్రొద్దుటూరు కల్చరల్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7న ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నట్టు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక జార్జి కారొనేషన్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యుత్ రంగంలో పనిచేస్తున్న జేఎల్ఎం గ్రేడ్-2లు, ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్-5 రాష్ట్ర కౌన్సిల్ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జునరెడ్డి, సుధీర్ బాబు కోరారు. ఆదివారం నగరంలోని ముస్లిం మైనార్టీ కమ్యూనిటీ హాల్‌లో ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్-5 రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న జేఎల్ఎం గ్రేడ్-2లు, ఉద్యోగుల, కార్మికుల సమస్యలు చాలా సంవత్సరాలుగా ఎలాంటి పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయని. విద్యుత్ యాజమాన్యం త్వరగా పరిష్కరించాలని హితవు పలికారు. జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్- 2లు 6 ఏళ్లుగా పనిచేస్తున్న ప్రమోషన్లకు అనర్హులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ యాజమాన్యం ఒక సంస్థలో రెండు రకాల సర్వీసులు అమలు చేస్తోందని, ఇది పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. విద్యుత్ యాజమాన్యం కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా ఇప్పటికైనా ఎనర్జీ అసిస్టెంట్‌ల ప్రధాన సమస్య అయిన నూతన సర్వీస్ రూల్స్ రద్దు చేసి ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగసుబ్బారెడ్డి. 5 హేమకుమార్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు హరికృష్ణ, అశోక్, ప్రతాప్, కృపాకర్, వెంకటేష్ నాయక్, సంజీవ నాయక్, అనిల్ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు సదవకాశం..

- అనధికార ప్లాట్లకు అనుమతులు
- ఎల్‌ఆర్ఎస్‌తో క్రమబద్ధీరణ
- ఎర్రగుంట్ల మున్సిపాలిటీలో 31 లే అవుట్లు



ఎర్రగుంట్లలో అధికారులు గుర్తించిన లేఅవుట్

ఎర్రగుంట్ల : ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) ద్వారా అనధికార లేఅవుట్లు, ప్లాట్లకు అనుమతులు పొందేందుకు, రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం జీవోను ఇటీవల విడుదల చేసింది. అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకు వెసులుబాటు కల్పిస్తూ ఎల్ఆర్ఎస్-2000 పథకాన్ని ఈ ఏడాది జులై 26వ తేదీన సవరణ చేసింది. అనధికార లేఅవట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు చేసుకునేందుకు ఈ ఏడాది అక్టోబర్-24వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలో పుట్టగొడుగుల్లా అనధికార లేఅవట్లు వెలిశాయి. రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో రియల్టర్లు చెప్పే మాయమాటలు నమ్మి ప్రజలు లక్షలాది రూపాయలు వెచ్చించి ప్లాట్లను కొనుగోలు చేశారు. వీరిలో కొందరు అప్పులు చేసి మరీ ప్లాట్లను కొనుక్కున్నారు. ఇటీవల మున్సిపల్ అధికారులు అనధికార లేఅవట్లను గుర్తించి అందులో మార్కింగ్‌లను తొలగించడం, సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేశారు. దీంతో ప్లాట్లను కొనుగోలు చేసుకున్న వారిలో అయోమయ పరిస్థితి నెలకొంది. ఇటువంటి వారికి ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా ప్లాట్లకు క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. లేఅవుట్లలో కాకుండా నాలుగు వేల చదరపు మీటర్ల కంటే తక్కువ విస్తీర్ణం కలిగిన వ్యక్తిగత సైట్లకు కూడా రాయితీలు కల్పించింది. అనధికార ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఎల్ఆర్ఎస్



మున్సిపల్ కార్యాలయం

వెబ్‌సైట్ ద్వారా ఈనెల నుంచే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. క్రమబద్ధీకరణకు 90 రోజులు గడువునిచ్చారు. అలాగే జూన్ 30వ తేదీలోపు రిజిస్టర్ చేసుకున్న ప్లాట్లకు ఓపెన్ స్పేస్ చార్జీలలో 50 శాతం రాయితీ కల్పించారు. ప్లాట్ల పీనలైజేషన్‌కు దరఖాస్తులు చేసుకున్న వారిలో 45 రోజుల్లో మొత్తం చార్జీలు చెల్లిచినట్లైతే వారికి అదనంగా మరో పది శాతం రాయితీ కల్పిస్తుంది. నిర్దేశించిన సమయం 90 రోజుల్లో చెల్లిస్తే ఐదు శాతం రాయితీని కల్పిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్ విలువ ఆధారంగానే ఎల్ఆర్ఎస్ చార్జీలు ఉంటాయి.

ఎర్రగుంట్లలో అనుమతిలేని 31 లేఅవుట్లు

మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 31 లేఅవుట్లు ఉన్నాయి. వీటిలో ఏ ఒక్క లేఅవుట్‌కు అనుమతులు లేవని మున్సిపల్ అధికారులు గుర్తించారు. ఈ 31 లేఅవుట్లలో సుమారు 800 ప్లాట్లు ఉన్నాయి. కేవలం 3 ప్లాట్ల వారు మాత్రం ఎల్ఆర్ఎస్ స్కీంకు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. వీటితో పాటు క్రమబద్ధీకరణ చేసుకోవాల్సిన స్థలాలు చాలా ఉన్నాయి. భవన నిర్మాణంలో మున్సిపల్ బిల్డింగ్ ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో ఇటువంటివి వెలుగులోకి వస్తున్నాయి.

ఎల్ఆర్ఎస్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలి



మున్సిపాలిటీలో అనధికారికంగా ఉన్న ప్లాట్లతో పాటు వ్యక్తిగత స్థలాలను కూడా ఎల్ఆర్ఎస్ స్కీం ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోవచ్చు. నిబంధనల మేరకు ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని అనధికారి ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి. క్రమబద్ధీకరణ చేసుకునే లేఅవుట్లలో ప్రభుత్వమే మౌలిక వసతులను కల్పించడంతో పాటు భవన నిర్మాణాలకు అవసరమైన అనుమతులను అందజేస్తుంది.

– పేర్లి శేషఫణి, మున్సిపల్ కమిషనర్, ఎర్రగుంట్ల